

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**"ఎక్కడికి వెళుతున్నాము?"** కారెక్కుతూ అడిగాను.

"ఐస్ రింక్‌కి" అన్నయ్య బదులిచ్చాడు.

ఐస్ రింక్ అంటే ఏంటో? అక్కడ చలేస్తుందా? ముందే చెపితే జాకెట్ తెచ్చుకునే దాన్నిగా! అని ఆలోచిస్తుంటే "నువ్వు చిన్నప్పుడు స్కేటింగ్ చేసేదానివి కదా?" అడిగాడు.

"యా. మనిద్దరం కలిసి చేసేవాళ్ళం. గుర్తుందా?" ఎదురు ప్రశ్నించాను.

"గుడ్"

గుడ్ అట. మరీ టూమచ్. ముందే చెప్పకుండా చలిప్రాంతానికి తీసుకెళుతున్నాడు. దానిపైన ఈ పొగరు కూడా అని చిరాకు పడుతూ ఓ పది నిమిషాలు కూర్చున్నాను.

"ఐస్ రింక్‌కి ఎప్పుడైనా వెళ్ళావా?" అడిగాడు.

"లేదు"

"సరే. నో ప్రోబ్లమ్" కారు దిగుతూ అన్నాడు. అన్నయ్య వెంటే నడిచాను.

"ఐస్ స్కేటింగ్‌కి నార్మల్ స్కేటింగ్‌కి కొంచెం తేడాలు ఉన్నాయి కానీ చాలా ఈజీ. భయపడకు. కింద పడితే దెబ్బ తగులుతుంది. కానీ దెబ్బ మానుతుంది కూడా" అన్నాడు.

"ఐస్ రింక్ అంటే ఐస్ స్కేటింగ్ ప్లేసా?" అడిగాను.

"ఓ నీకు తెలియదా? ఇంకేమనుకున్నావు?" నవ్వాడు.

లోపల మా ఇద్దరికి స్కేట్స్ తీసుకుని అవి ఎలా వేసుకోవాలో చూపించాడు.

"రింక్‌లోకి వెళ్ళాక పెంగ్విన్‌లా నడువు. అలవాటయ్యాక నెమ్మదిగా స్కేట్ చెయ్యి. నేను పక్కనే ఉంటాను అన్నాడు.

"పెంగ్విన్‌లా అంటే ఎలా?" భయంగా అడిగాను.

రింక్‌లో ఒకరిని చూడమని "అలా" అన్నాడు.

నేను వేలితో చూపించి కన్‌ఫర్మ్ చేసుకుందామనుకునేలోపు నన్ను ఆపి "ఇక్కడ వేలితో ఎవర్నీ చూపించకూడదు. ఆ వైట్ షర్ట్ వేసుకుని రెండు జళ్ళున్న అమ్మాయిలా" అన్నాడు.

చూడ్డానికి నవ్వొచ్చేలా ఉంది ఆ నడక. నన్ను చూసి అందరూ నవ్వుతారేమో అని చిన్నబోయాను. అది గమనించి "చుట్టుపక్కల చూడు ఎవరి పనిలో వాళ్ళున్నారు. నువ్వు ఎలా నడుస్తున్నావని ఎవరూ ఎదురు చూడట్లేదు. అయినా అలా నడవడమే ఫస్ట్ లెసన్. ఎవ్వరూ నిన్ను చూడరు" ధైర్యం చెప్పాడు.

సరే అని రింక్ దాకా నడిచాను. ఐస్ మీద కాలుపెడితే బనానా తొక్క మీద కాలేసినట్టు జారిపడతానేమో అని భయం వేసింది. అన్నయ్య నా రెండు చేతులూ పట్టుకుని నడిపించాడు. ఐస్ మీద కాలు పెట్టగానే వణకడం మొదలైంది. ఎంతో భయంగా, చాలా జాగ్రత్తగా ముందుకెళ్ళాను. ఐదడుగులు వేసాక కూడా కాళ్ళు వణకడం ఆగలేదు. "ఆ రోప్‌ని పట్టుకో ఒక చేత్తో. ఇంకో చేత్తో నన్ను పట్టుకో. భయపడకు" అంటూ ప్రోత్సహించాడు. కొంతదూరం నడిచాక అలవాటైంది. సగందూరం వచ్చామేమో అని వెనక్కి తిరిగి చూసాను. కానీ సగంలో సగం కూడా రాలేదు. పెంగ్విన్ నడక కాస్త పెరిగింది. కాలీడుస్తూ నడిచిన విధంగా కొంత దూరం వెళ్ళాను. ఆ తరవాత చిన్నగా స్కేట్ చేసాను. అన్నయ్య తన వేగంని నా వేగంకి సరిపోయేట్టు జాగ్రత్తపడ్డాడు. చుట్టుపక్కల అందరూ అన్నయ్య చెప్పినట్టే ఎవరిపనిలో వాళ్ళున్నారు. కొంతమంది చిన్నపిల్లలు కూడా భలే స్కేట్ చేస్తే, మరికొంతమంది పెద్దవాళ్ళు కష్టపడ్డారు. వాళ్ళతో వచ్చిన వ్యక్తి కిందపడగానే కొందరు నవ్వారు. వారితో వచ్చిన గుంపులో కొంతమంది ఆ నవ్వుని వాళ్ళ ఫోన్‌లో ఫోటోగా బంధించారు, మరికొంతమంది కొత్తవాళ్ళు లేపేందుకు సహాయం చేసారు. అందరూ నవ్వుతూ ఆనందించడం చూసి నా మూడ్ కూడా అలానే మారింది. వారిలో ఒకరిని వివరించి "నువ్వు అలా స్కేట్ చెయ్యగలుగుతావా?" అన్నయ్యని అడిగాను.

"మరీ అంత బాగారాదు. ఏదో మేనేజ్ చెయ్యగలుగుతాను" అని చూపించాడు.

"నువ్వు పట్టుకోకుండానే అలా బాగా స్కేట్ చేస్తున్నావే" ఆశ్చర్యంగా అన్నాను.

"చాలా ప్రాక్టీస్ చేసాను. ఫస్ట్ టైం నేనూ నీలానే భయపడ్డాను" బదులిచ్చాడు తెలియకుండానే అన్నయ్య చెయ్యి వదిలేసి ముందుకెళ్ళడం ప్రారంభించాను. "నేనొక రౌండ్ వేసివస్తా" అంటూ అన్నయ్య గిరగిరా తిరిగాడు. అదృష్టవసాత్తు నా ఓవర్ కాన్ఫిడెన్స్ వల్ల కిందపడినప్పుడు అన్నయ్య నా వెనకే ఉన్నాడు. షాక్‌కి నేను కొన్ని క్షణాలు కదలలేదు. ఒక ఫోటో తీసిన తరువాతే అన్నయ్య నన్ను లేపాడు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కనీ అవి బుగ్గమీదకి జారేలోపే ఎవరో "మై వైఫ్ స్టిల్ ఫాల్స్ లైక్ టామ్" అంటూ ఆవిడని

ముందుకు నెట్టాడు. ఆవిడ పడకుండా బాలెన్స్ చెయ్యడం చూసి నేనూ నవ్వాను. ఆ తరవాత మరో రెండుసార్లు కిందపడ్డాను కానీ ఏడుపు రాలేదు. అన్నయ్యతో కలిసి పెద్దగా నవ్వాను. నేను అంతగా నవ్వి ఎన్నో రోజులవుతుందని గ్రహించాను.

"డిన్నర్‌కి వెళ్దామా?" అన్నయ్య అడిగాడు.

"ఇంకాసేపుందామన్నయ్య"

"సరే. టెన్ మినిట్స్ మాత్రమే" అన్నాడు.

అస్సలు వెళ్ళబుద్ధికాలేదు. "కాసేపటికి ఆకలి తెలుస్తుంది. ఈలోపు ఆర్డర్ చేస్తే బెటర్" అని సర్ది చెప్పాడు.

కారెక్కినప్పుడు కూడా నా ముఖంలో చిరునవ్వు అలానే ఉంది.

"రాత్రికి నొప్పి తెలుస్తుంది. రేపొద్దునకి దెబ్బ తగిలినచోట రంగు మారితే భయపడకు. అదే తగ్గిపోతుంది. ఇంటికెళ్ళాక గుర్తుచెయ్యి ఆయింట్‌మెంట్ ఇస్తాను" అన్నాడు.

ఐదు నిమిషాల్లోనే ఒక రెస్టారెంట్ ముందు ఆగాము. అన్నయ్య చెప్పినట్టే ఆకలి మొదలైంది. పొద్దున జరిగిన అనుభవంతో టేబుల్ దగ్గరకి వెళ్ళిపోకుండా అక్కడే ఆగి వెయిటర్ చూపించిన టేబుల్ దగ్గర కూర్చున్నాను.

"ఇక్కడ టామ్ యమ్ సూప్ చాలా బావుంటుంది. పైన్ ఆపిల్ ఫ్రైడ్ రైస్ కూడా" మెన్యూలో చూపిస్తూ చెప్పాడు.

"పైనాపిలా?" బుంగమూతి పెట్టాను.

"చాలా బావుంటుంది. నువ్వు వేరే ఏదైనా తీసుకో. షేర్ చేసుకుందాం" అన్నాడు.

వెయిటర్ వచ్చాక ఆ రెండిటితోపాటు పేడ్‌థాయ్ ఆర్డర్ చేసాము. అన్నయ్య రెండు ప్లేట్లు తెమ్మనడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

"ఇక్కడ ఇండియాలోలాగా వడ్డించరు. ఎవరు ఆర్డర్ చేసింది వాళ్ళే తింటారు. మనం షేర్ చేసుకుంటున్నాం కాబట్టి రెండు ఎక్స్‌ట్రా ప్లేట్లు అడిగాను" వివరించాడు.

"ఏం తాగుతావు?" అడిగాడు.

"ఉత్త నీళ్ళు చాలు" జవాబిచ్చాను.

"ఇక్కడ జాస్మిన్ టీ చాలా బావుంటుంది" అంటూ అదికూడా ఆర్డర్ చేసాడు. పైన్ ఆపిల్ ఫ్రైడ్ రైస్ ఏంటో, మల్లెపూల టీ ఏంటో? ఈ అన్నయ్య ఇలా అయిపోయాడేంటి అని ఆలోచిస్తుండగానే టీ సర్వ్ చేసారు. ఎంతో భయంగా గంటసేపు ఊది ఏ విషం తాగుతున్న మొహంతో మొదటి గుటక వేసాను. వాసన పూలదే అయినా రుచి ఎంతో బావుంది. రెండో సిప్‌కి నా మొహంలో తేడాని చూసి అన్నయ్య సంతోషించాడు. మా ఆర్డర్ వచ్చాక తినడం ప్రారంభించాం.

"ఐస్ స్కేటింగ్ ఎలా అనిపించింది?" అడిగాడు.

"చాలా నచ్చింది. ఫస్ట్‌లో చాలా భయమేసింది కానీ లాస్ట్‌లో అస్సలు రావాలనిపించలేదు."

"నువు చాలా ఫాస్ట్ లర్నర్‌వి. నువ్వు ఇవాళ నేర్చుకున్నది నాకు మూడురోజులు పట్టింది"

"ఔనా. థాంక్స్" మురిసిపోయాను.

"నువు చాలా టాలెంటెడ్, కానీ కాస్త పిరికిదానివి. అలా అన్నిటికీ భయపడకు. ఐస్ స్కేటింగ్‌ని ఎగ్జాంపుల్‌లా తీసుకో. ఫస్ట్ స్టెప్‌కి నీ కాళ్ళు వణికాయి. తరువాత కింద పడినా నవ్వుతూ లేచావు. ఒక్కసారి ముందుకెళితే ఏ పనైనా నచ్చుతుంది. నువ్వు ఏరోస్పేస్ ఇంజినీర్ కాబట్టి ఫ్యూచర్‌లో నువ్వు విమానాన్ని టెస్ట్ చెయ్యాల్సి రావచ్చు. లేదా విమానంలో కొత్తవి కనిపెట్టాల్సి రావొచ్చు. 'నాకు భయం, నేను చెయ్యను' అంటే కుదరదు. కెరీర్‌లో ముందుకి వెళ్ళాలంటే చాలా స్ట్రాంగ్ గా ఉండాలి. అలాకాదు రిసెప్షనిస్ట్‌లా రోజా

ఒకే పనిచేసే ఉద్యోగం చాలు అంటే అది వేరే సంగతి. ఇండియాలో ఇక్కడన్ని ఆపర్ట్యూనిటీస్ ఉండవు. నీకన్నా తెలివైన వాళ్ళున్నా, వాళ్ళకి ఇక్కడ చదివే స్తోమత, లేదా గైడెన్స్ ఆర్ ఫ్రీడం ఉండకపోవచ్చు. ఆ అవకాశం నీకొచ్చింది. దాన్ని యుటిలైజ్ చేసుకో"

తలూపాను.

"రోజూ క్లాస్ పీకుతున్నాను అని తిట్టుకోకు. ఇవ్వన్నీ నీ మంచికోసమే చెబుతున్నా. ఏరోనాటిక్స్ చాలా కష్టం. సిటిజెన్స్ లేదా గ్రీన్ కార్డ్ హోల్డర్స్‌కే జాబ్ ఇస్తారు. నీకు ఎంతో క్వాలిఫికేషన్స్ ఉంటేకానీ ఉద్యోగం ఇవ్వరు. పక్కవాళ్ళు పదిశాతం కష్టపడితే నువ్వు యాభై శాతం కష్టపడాల్సి ఉంటుంది. కష్టంగా ఉంది అని మానేయాలనుకుంటే చెప్పు, నాన్నతో సంబంధాలు చూడమని చెప్తా. ఇంత డబ్బుపోసి చదవడం దండగ."

"నేను బాగా చదువుతా అన్నయ్యా. చదవడంతో నాకు ఏ ప్రాబ్లం లేదు .మా ప్రొఫెసర్స్ అందరికి కూడా నేను చాలా ఇష్టం" దిగులుగా అన్నాను.

"నాకు తెలుసు. పర్‌డ్యూలో సీట్ వచ్చిందంటేనే నీ టాలెంట్ తెలుస్తుంది. కానీ అది సరిపోదు. ఇంకా కష్టపడాలి. క్లిష్టమైన సిట్యుయేషన్స్ వస్తాయి. నువ్వు రోజంతా ఆన్ కేంపస్ జాబ్‌లో నుంచుని కేషియర్ పనిచేసి, క్లాస్‌కి వెళ్ళి హోం వర్క్స్ పూర్తిచేసి, చలిలో నడుచుకుంటూ ఇంటికి వచ్చాక వంట చేసి తిని పడుకున్న పదినిమిషాలకి నీ రూమ్ మేట్ ఇంటికొచ్చి పెద్ద సౌండ్‌తో పాటలు వింటూ లైట్ ఆన్ చెయ్యొచ్చు. గొడవ పెట్టుకుంటే ఇల్లుమారేదాకా అదే కథ నడుస్తుంది. పోనీ లేట్‌గా పడుకుందామంటే పొద్దున ఏడుకల్లా క్లాస్‌లో ఉండాలి. అది వరస్ట్ కేస్ సినారియో. అలాంటివి వచ్చినప్పుడు ఏడుస్తూ లేదా భయపడుతూ వెనక్కి తిరగాలనుకోకు. సర్దుకుపోవడం నేర్చుకో. రేపు అంతకన్నా బేడ్ సిట్యుయేషన్‌కి ప్రిపేర్ అవుతున్నావనుకో. నెగెటివ్‌గా ఆలోచించకు. ఒక్కసారి చదువు పూర్తై జాబ్ వచ్చాక నాలా ఒక్కదానివే హాయిగా ఉండొచ్చు. ఇప్పుడు జరిగేదంతా టెంపరరీ. అది గుర్తుపెట్టుకో" అంటూ బోధించాడు.

భోజనం పూర్తై ఇంటికి బయులుదేరినప్పుడు నేను దీర్ఘాలోచనలో ఉండడం గమనించి "సీరియస్‌గా ఉండకే నిన్ను చూస్తుంటే ఈ పాట గుర్తొస్తుంది" అంటూ 'ఈ గంగ కెంత దిగులు,, ఈ గాలికెంత గుబులు' పాటని ప్లే చేసాడు. ఆ పాటని జీవితంలో ఎప్పుడూ వినలేదు. అన్నయ్యకెలా ఎలుసా అని ఆశ్చర్యపోలేదు (అన్నయ్యలో మార్పు ఈ పాటికి అలవాటైపోయింది).

"మిస్ గుహుడు, ఇల్లొచ్చేసిందిలే" అన్నయ్య అన్నాడు.

లోపలికెళ్ళి బట్టలు మార్చుకోకుండానే మంచమ్మీద పడి కుంభకర్ణుడిలా నిద్రపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story